# ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక

**Bullet Edition**

శనివారం, 3 ఆగస్టు 2024 | www.prajaaswaramdaily.com | 2PM


## మా భార్యలను కాపురానికి పంపండి..

### కలెక్టరేట్ వద్ద ఇద్దరు అల్లుళ్ల నిరాహార దీక్ష



ఏలూరు, ఆగస్టు 3 (ప్రజాస్వరం) : పెళ్లిళ్లు అయ్యాక ఇద్దరు కూతుళ్లను కాపురానికి పంపకుండా.. ఇదేమని అడిగితే తమపైనే కేసులు పెట్టి ఇబ్బందులు పెడుతున్నారని ఇద్దరు అల్లుల్లు నిరాహారదీక్షకు దిగారు. ఏలూరు కలెక్టరేట్ ఎదుట శనివారం ఉదయం నుంచివారు టెంట్ వేసుకుని దీక్ష చేస్తున్నారు. తమ మామపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.



# గుడ్ మార్నింగ్ అమెరికా

## అమెరికా బయలుదేరి వెళ్లిన సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్, ఆగస్టు 3 (ప్రజాస్వరం) : రాష్ట్రానికి పెట్టుబడులే లక్ష్యంగా సీఎం రేవంత్ రెడ్డి అమెరికాకు బయలుదేరి వెళ్లారు. అమెరికాతో పాటు దక్షిణ కొరియాలోనూ ముఖ్యమంత్రి పర్యటించనున్నారు. సీఎం వెంట సీఎస్, ఐటీ, పరిశ్రమల శాఖ చీఫ్ సెక్రటరీ జయేష్ రంజన్, పరిశ్రమల శాఖ ప్రత్యేక కార్యదర్శి విష్ణువర్ధన్ రెడ్డి సైతం వెళ్లారు. అమెరికాలో పలు నగరాల్లో సీఎం బృందం పర్యటించనుంది. ఆగస్టు4న శ్రీధర్ బాబు, 5న కోమటిరెడ్డి అమెరికా వెళ్లనున్నారు. అక్కడే సీఎం బృందంతో కలిసి పర్యటనలో పాల్గొంటారు. టూర్ లో భాగంగా పలు కంపెనీలతో సర్కారు ఒప్పందాలు చేసుకునే చాన్స్ ఉంది.




## ఖైరతాబాద్ గణేష్ రూపం ఇదే..

హైదరాబాద్, ఆగస్టు 3 (ప్రజాస్వరం) : ఖైరతాబాద్ గణేశ్ ఉత్సవ కమిటీ శుక్రవారం సాయంత్రం ఖైరతాబాద్ గణేశుడి విగ్రహ ఆదిదేవుడి స్వరూపం నమూనాను విడుదల చేసింది. ఈసారి 'సప్తముఖ మహా శక్తి గణపతి'గా భక్తులకు వినాయకుడు దర్శనం ఇవ్వనున్నారు. ఇక్కడ గణేషుడిని నిలబెట్టడం 70 సంవత్సరాలను పురస్కరించుకొని 70 అడుగుల విగ్రహాన్ని సిద్ధం చేస్తున్నారు. శ్రీ సప్తముఖ మహా శక్తి గణపతిగా దర్శనమీయనున్న ఖైరతాబాద్ గణనాథుడికి కుడివైపున శ్రీనివాస కళ్యాణం, ఎడమ వైపున శివపార్వతుల కళ్యాణం ఏర్పాటు చేయనున్నారు. ప్రత్యేక ఆకర్షణగా అయోధ్య బాలరాముడి ప్రతిమను ఏర్పాటు చేయనున్నారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## 8 మంది ఐఏఎస్‌ల బదిలీ

హైదరాబాద్, ఆగస్టు 3 (ప్రజాస్వరం): తెలంగాణలో 8 మంది ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వాణిజ్య పన్నుల శాఖ కమిషనర్ టి.కె.శ్రీదేవిని ఎస్సీ అభివృద్ధి శాఖ కమిషషనర్ గా బదిలీ చేశారు. వాణిజ్య పన్నుల శాఖ కమిషనర్ గా రిజ్వీకి అదనపు బాధ్యతలు అప్పగించారు. విపత్తుల నిర్వహణ విభాగం సంయుక్త కార్యదర్శి ఎస్.హరీశ్ కు రవాణా, ఆర్ అండ్ బీ సంయుక్త కార్యదర్శిగా అదనపు బాధ్యతలు అప్పగించారు. మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ గా ఉదయ్ కుమార్ కు అదనపు బాధ్యతలు కేటాయించారు. పురపాలక శాఖ ఉపకార్యదర్శిగా ప్రియాంక, హాకా ఎండీగా చంద్రశేఖర్ రెడ్డి, మార్క్ ఫెడ్ ఎండీగా శ్రీనివాస్ రెడ్డి, రవాణా, ఆర్అండ్ బీ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా వికాస్ రాజ్ బదిలీ అయ్యారు.

## రాహుల్ జీ.. అశోక్‌నగర్‌కు రండి


### కాంగ్రెస్ అగ్రనేత పాత ట్వీట్‌ను.. రీ ట్వీట్ చేసిన మాజీ మంత్రి కేటీఆర్

హైదరాబాద్, ఆగస్టు 3 (ప్రజాస్వరం): కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల ముందు హైదరాబాద్ అశోక్ నగర్‌లో నిరుద్యోగ యువకులను కలిసిన విషయం తెలిసిందే. ఎన్నికల ప్రచారం సందర్భంగా కాంగ్రెస్ అగ్రనేత చేసిన ఓ ట్వీట్‌ను రీ ట్వీట్ చేస్తూ మాజీ మంత్రి కేటీఆర్ కాంగ్రెస్‌పై ఫైర్ అయ్యారు. 'హలో రాహుల్ గాంధీ జీ, తెలంగాణ యువత మీరు చెప్పిన ఏడాదికి 2 లక్షల ఉద్యోగాల హామీని నమ్మి కాంగ్రెస్ పార్టీకి ఓటు వేశారన్నారు. అయితే 8 నెలల తర్వాత కాంగ్రెస్ విడుదల చేసిన 'జాబ్ లెస్ క్యాలెండర్, జీరో ఉద్యోగాల కారణంగా యువత ఆందోళన బాట పట్టారని తెలిపారు. మీరు ఎందుకు మళ్లీ హైదరాబాద్‌లోని అశోక్ నగర్‌కు వచ్చి అదే యువతను కలిసి మీరిచ్చిన హామీలను ఎలా నెరవేరుస్తారో చెప్పొచ్చు కదా అని సూచించారు.

## ప్రాజెక్టులు అడుగంటుతున్నాయి

### ఉత్తమ్‌కు హరీశ్‌రావు లేఖ

హైదరాబాద్, ఆగస్టు 3 (ప్రజాస్వరం) : నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి భారాస ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు లేఖ రాశారు. సిద్దిపేట జిల్లాలో ప్రాజెక్టులు నీళ్లు లేక అడుగంటిపోతున్నాయని అందులో పేర్కొన్నారు. అన్నపూర్ణ, రంగనాయకసాగర్, మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్ లో నీళ్లు లేక అడుగంటిపోయే పరిస్థితికి వచ్చాయన్నారు. గతేడాది ఆగస్టులో ఆయా జలాశయాల్లో నీటి నిల్వ ఉందని చెప్పారు. కానీ ప్రస్తుతం వీటిలో చాలా తక్కువ నీరు ఉందని తెలిపారు. వర్షాలు రాక రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని.. పంటలు వేయాలా? వద్దా? అనే సందిగ్ధం వారిలో నెలకొందని వివరించారు. మధ్య మానేరు నుంచి నీటిని పంపింగ్ చేసేలా అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని హరీశ్ రావు కోరారు.


T. HARISH RAO
M.L.A.,
33-Siddipet Assembly Constituency

Camp Office :
H.No. 18-1924, Prashanthnagar,
Siddipet Town and District.
Cell : 084572 22222

Hyderabad Office :
Villa No. 1025, Krinss Villas,
Puppalaguda, Financial District,
Hyderabad.
Contact No. 040-23114222
Cell : 94404 71409

గౌరవనీయులు శ్రీ ఉత్తమ్ కుమార్ రెడ్డి గారికి,

సిద్దిపేట జిల్లాలోని అన్నపూర్ణ (అంతగిరి) రిజర్వాయర్, రంగనాయక సాగర్, మల్లన్న సాగర్, కొండ పోచమ్మ సాగర్ లు పూర్తి గా నీళ్లు లేక రిజర్వాయర్ లు అడుగంటి పోయే పరిస్థితికి చేరుకున్నాయి. గత సంవత్సరం ఇదే ఆగస్టు నెలలో అనంతగిరి రిజర్వాయర్ లో 3.32 టి ఎం సీల నీళ్ళు ఉంటె ప్రస్తుతం 0.75 టి ఎం సి లు, రంగనాయక సాగర్ లో 2.38 టి ఎం సి లకు గాను ప్రస్తుతం 0.67 టి ఎం సీలు, మల్లన్న సాగర్ 18 టి ఎం సీలకు గాను ప్రస్తుతం 8.5 టి ఎం సి లు, కొండ పోచమ్మ సాగర్ 10 టి ఎం సి లకు గాను ప్రస్తుతం 4.5 టి ఎం సీలు మాత్రమే ఉన్నాయి.

ఒకవైపు రిజర్వాయర్లలో నీళ్లు లేక, మరోవైపు వర్షాలు కురవక రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారు. పంటలు వేయాలా వద్దా అనే అయోమయంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. గత సంవత్సరం ఇదే సమయంతో పోలిస్తే జిల్లాల పంటల సాగు విస్తీర్ణం కూడ తగ్గి పోయింది. కాబట్టి రాజకీయాలు పక్కనబెట్టి మిడ్ మానేర్ నుండి అన్నపూర్ణ రిజర్వాయర్, రంగనాయక సాగర్, మల్లన్న సాగర్, కొండ పోచమ్మ సాగర్ లకు నీటిని పంపింగ్ చేసేలా ఇరిగేషన్ అధికారులకు వెంటనే ఆదేశాలు జారీ చేయాలని, అదేవిధంగా కాలువల ద్వారా నీటిని విడుదల చేసి ఆయకట్టుకు నీళ్లందించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా రైతాంగం పక్షాన కోరుతున్నాను.

ధన్యవాదాలు,

భవదీయుడు,
(తన్నీరు హరీష్ రావు)


శ్రీ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి గారు,
నీటిపారుదల, ఆహారం & పౌర సరఫరాల శాఖామాత్యులు,
తెలంగాణ ప్రభుత్వం,
హైదరాబాద్.

# త్వరలో ఇందిరమ్మ ఇళ్లు..

### మొదటి విడత 4.50 లక్షల ఇళ్ల పంపిణీ

### అభివృద్ధి, సంక్షేమం జోడెద్దులే

### మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి



హైదరాబాద్, ఆగస్టు 3 (ప్రజాస్వరం) : తెలంగాణ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి సంబంధించి మరో గుడ్ న్యూస్ చెప్పింది. ఈ మేరకు ఇళ్ల నిర్మాణానికి సంబంధించి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి శనివారం కీలక ప్రకటన చేశారు. పథకంలో భాగంగా ఈ నెలాఖరులోపు మొదటి విడత కింద రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని వెల్లడించారు. అర్హులైన వారందరికీ ఇళ్లు ఇస్తామని స్పష్టం చేశారు. భూపాలపల్లి జిల్లా గణపురం మండలంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, శ్రీధర్ బాబు, సీతక్క పర్యటించారు. గాంధీనగర్ క్రాస్ మైలారం గుట్టపై ఇండస్ట్రియల్ పార్కుకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పొంగులేటి మాట్లాడారు. బీఆర్ఎస్ హయాంలో సీఎం కేసీఆర్ ఏ వేదికపైకి ఎక్కినా డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల గురించి మాయమాటలు చెప్పారని, తన సొంత నియోజకవర్గంలో నిర్మించిన ఇళ్లను పేపర్లలో ఫోటోలు వేయించుకుని ప్రజలను మభ్యపెట్టి ఎన్నికల్లో ఓట్లు అడిగారని మండిపడ్డారు. పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం కేవలం 1.50 లక్షల ఇళ్లు మాత్రమే నిర్మిస్తే నేడు ఇందిరమ్మ ప్రభుత్వం మొదటి విడతలోనే 4.50 లక్షల ఇళ్లు నిర్మించబోతున్నట్లు చెప్పారు.

#### సాగు భూములకు పట్టాలు

సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమమే జోడెద్దుల్లా పేదల కోసం కృషి చేస్తుందని మంత్రి పొంగులేటి అన్నారు. భూములు సాగు చేస్తున్న రైతులకు పట్టాలు ఇచ్చే బాధ్యత ప్రభుత్వానిదని వెల్లడించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఆర్థికంగా భారమైనా రైతు రుణమాఫీ చేస్తున్నామని చెప్పారు. గత ప్రభుత్వం రూ.7.20 లక్షల కోట్లు అప్పులు చేసింది. రాష్ట్రంలో ఆర్థికంగా ఇబ్బందులు ఉన్నా ఇచ్చిన మాట నెరవేర్చాలని సీఎం పట్టుబట్టి రుణమాఫీ చేస్తున్నారు. ఇప్పటికే రెండు విడతల్లో రూ.లక్షన్నర వరకు ఉన్న రుణాలు మాఫీ చేశాం. ఈ నెలాఖరు వరకు రూ.2 లక్షల వరకు ఉన్న రుణాలు మాఫీ చేస్తాం. రైతులకు అవసరమైన పనిముట్లలో ఇవ్వాల్సిన రాయితీలను బీఆర్ఎస్ ప్రభుత్వం మర్చిపోతే కాంగ్రెస్ ప్రభుత్వం రైతును రాజుగా చేసేందుకు రైతు రుణమాఫీతో పాటు రైతు భరోసా, వ్యవసాయ పనిముట్లపై రాయితీ, పంట ఇన్సురెన్సు, విత్తనాలపై రాయితీలు ఇస్తున్నాం.' అని మంత్రి పేర్కొన్నారు.